సాక్షి
శ్రీకాకుళం
సోమవారం, 3, జూన్, 2024



అడవికి అండ

వేసవిలో వన్య ప్రాణుల దాహార్తి తీరుస్తున్నారు. అడవిలో నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నారు. - 8లో



సముద్రంలో మునిగి..

భావనపాడు తీరంలో మునిగి ఓ విద్యార్థి మృతి చెందాడు. అతనిది సారవకోట మండలం మర్రిపాడు గ్రామం. - 8లో



ఒక్క రోజులో రూ.9.57 లక్షలు

ఆదిత్యుని సన్నిధి భక్తులతో కిక్కిరిసిపోయింది. ఒక్క రోజులో రూ.9లక్షల పైచిలుకు ఆదాయం వచ్చింది. - 8లో

న్యూస్‌రీల్

బాలుడి మృతిపై డీసీహెచ్‌ఎస్ విచారణ



చిన్న నారాయణపురంలో బాధిత కుటుంబాన్ని విచారిస్తున్న అధికారులు

టెక్కలి రూరల్: టెక్కలి మండలం చిన్న నారాయణపురానికి చెందిన దాసరి సాయివినీత్(12) అనే బాలుడు గత నెల 21న పాము కాటుకు గురై మృతి చెందాడు. అయితే బాలుని మృతికి టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కారణమని బాధిత కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జీవీ రాజ్యలక్ష్మీ, అసిస్టెంట్ డైరెక్టర్ శేషగిరి గ్రామంలో మృతి చెందిన బాలుని ఇంటి వద్ద విచారణ చేపట్టారు. తమ కుమారుని మృతికి టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రి సిబ్బందే కారణమని బాలుని తల్లిదండ్రులు అధికారుల వద్ద విలపించారు. ఆస్పత్రిలో వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చూపారని అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జరిగిన ఘటనను వివరిస్తూ బాలుని తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. నిర్లక్ష్యం వహించి మృతికి కారణమైన వారికి తగు శిక్ష విధించి భవిష్యత్‌లో ఏ తల్లిదండ్రులకు ఇలాంటి మానసిక క్షోభ లేకుండా చూడాలని వారు అధికారులకు వేడుకున్నారు.

'జీడి పిక్కలకు కనీస మద్దతు ధర రూ.16వేలు ప్రకటించాలి'



జీడి మద్దతు ధర కావాలని డిమాండ్ చేస్తున్న యూవీవీ ప్రతినిధులు

పలాస: ఉద్దానం ప్రాంతంలోని జీడి రైతుల జీవనాధారమైన జీడి పంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధర బస్తాకు రూ.16వేలు ప్రకటించాలని ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక (యూవీవీ)డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం నీలావతి గ్రామంలో యూవీవీ ప్రతినిధులు సమావేశమై ఒక తీర్మానం చేశారు. ఈ తీర్మాన ప్రతులను వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ ఏడాది పంట దిగుబడి 20శాతం వచ్చిందని, కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పలాసలో జీడి బోర్డును ఏర్పాటు చేయాలని, రైతులకు అన్ని విధాలుగా తగిన మేలు చేకూర్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో యూవీవీ అధ్యక్షులు బొమ్మాళి శివ, గౌరవ అధ్యక్షుడు కె.ప్రకాశరావు, బొడ్డు చిన్నారావు, తెప్పల వాసు, జినగ సీతారామయ్య, కృష్ణారావు, కుత్తుం సుధాకర్, కుత్తుం వినోద్, ఎంపల్ల కామేశ్వరరావు, ఎస్.మాధవరావు, పి.మాధవరావు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలను త్వరగా ప్రకటించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఘట్టాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు, కచ్చితమైన ఫలితాలను త్వరితగతిన ప్రకటించేందుకు ప్రయత్నం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. కౌంటింగ్ పై జిల్లాల వారీగా చేస్తున్న ముందస్తు ఏర్పాట్లపై ఆదివారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు.

ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్, పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు, ఈవీఎంలలో పోల్ అయిన ఓట్ల లెక్కింపునకు అవసరమైన శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, రౌండ్ల వారీగా ఫలితాల ట్యాబులేషన్, ఎన్కోర్‌లో ఫీడ్ చేయడం, అందుకు అవసరమైన ఐటీ సిస్టంల ఏర్పాటు, ఓట్ల లెక్కింపు పూర్తయిన తదుపరి ఈవీఎంలను సీల్ చేసే విధానంపై అవగాహన, స్టేట్యూటరీ నివేదిక, రౌండ్ వైజ్ నివేదికలు పంపించేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు, ఈ నెల 8వ తేదీ లోపు నివేదించాల్సిన ఇండెక్స్ కార్డు రూపొందించే విధానం, మూడు అంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు తదితర అంశాలపై జిల్లాల వారీగా జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమానికి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జీలాని సమూన్ హాజరయ్యారు. జిల్లా నుంచి కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను వివరించారు.



కళాశాల బయట ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

రాగల 24 గంటల్లో..

- రేపే సార్వత్రిక ఓట్ల లెక్కింపు
- లెక్కింపునకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు
- 2000 మంది సిబ్బంది వినియోగం
- తొలి ఫలితం ఆమదాలవలస
- తుది ఫలితం పాతపట్నం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

కళ్లు మూస్తే ఈవీఎంలు.. కళ్లు తెరిస్తే ఎగ్జిట్ పోల్స్.. నిద్దట్లో అంకెల లెక్కలు.. ఏ ఇద్దర్ని కదిపినా గెలుపోటములపై చర్చలు.. ఇప్పుడెక్కడ చూసినా ఇవే పరిస్థితులు. మే 13న బారులు తీరిన జనం తమ తీర్పు ఎటు ఇచ్చారో.. రాత్రి 11గంటల వరకు ఓపికతో నిరీక్షించి ఓటేసిన జనం ఎవరిని అభిమానించారో.. తెలిసే సమయం దగ్గరకు వచ్చేసింది. ఎన్నికలు ముగిసి 21రోజులు దాటిపోయింది. మరొక రోజు ఆగితే గెలుపెవరిదో తెలిసిపోతుంది.

సార్వత్రిక ఎన్నికల ఫలితం వెల్లడయ్యే సమయం సమీపించింది. 21 రోజుల క్రితం నిర్వహించిన ఎన్నికల మహాక్రతువులో జనం ఇచ్చిన తీర్పు మంగళవారం బయటకు రానుంది. ఎచ్చెర్ల మండలం శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరగనుంది. గత కొన్ని రోజులగా తమదైన లెక్కల్లో మునిగిన నేతలు, కార్యకర్తలు ఎగ్జిట్ పోల్స్ వచ్చిన తర్వాత మరింత ఉత్కంఠకు లోనవుతున్నారు. ఒక రోజు వ్యవధిలో ఎన్నికల బరిలో ఉన్న 86మంది భవితవ్యమేంటో తేలిపోనుంది. మరోవైపు అధికార యంత్రాంగం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ లెక్కింపు క్రతువు ప్రశాంతంగా ముగిసిపోతే అదే చాలని భావిస్తోంది. శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో లెక్కింపునకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసింది. 2000 మంది ఉద్యోగులకు లెక్కింపు ప్రక్రియకు వినియోగిస్తున్నారు. ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో లెక్కింపు ప్రారంభం కానుంది. ఈ మేరకు 17కౌంటింగ్ గదులు ఏర్పాటు చేశారు. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలను లెక్కించేందుకు 112 టేబుళ్లను ఏర్పాటు చేయగా, పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కించేందుకు 29 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గం ఈవీఎంల లెక్కింపునకు 98 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ లెక్కించేందుకు 30 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభమైన అరగంట తర్వాత ఈవీవీఎంల లెక్కింపు మొదలు కానుంది. జిల్లాలో ఈవీఎంల ద్వారా 14,17,959ఓట్లు పోలవ్వగా, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 25,826 ఓట్లు పోలయ్యాయి.



దారి చూపిస్తూ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నియోజకవర్గాల వారీగా ఈవీఎంల్లో పోలైన ఓట్లు

నియోజకవర్గం	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
ఇచ్ఛాపురం	1,87,024	84,291	1,02,731	2
పలాస	1,65,257	76,839	88,416	2
టెక్కలి	1,86,897	91,326	95,569	2
పాతపట్నం	1,60,107	78,510	81,594	3
శ్రీకాకుళం	1,86,658	90,732	95,925	1
ఆమదాలవలస	1,54,357	76,103	78,251	3
ఎచ్చెర్ల	2,03,831	1,02,681	1,01,147	3
నరసన్నపేట	1,73,828	85,638	88,189	1
	14,17,959	6,86,120	7,31,822	17

నియోజకవర్గం	పీఎస్‌లు	టేబుళ్లు	రౌండ్లు
ఇచ్ఛాపురం	299	14	22
పలాస	284	14	21
టెక్కలి	315	14	23
పాతపట్నం	323	14	24
శ్రీకాకుళం	279	14	20
ఆమదాలవలస	259	14	19
నరసన్నపేట	290	14	21
ఎచ్చెర్ల	309	14	23

తొలి ఫలితం ఆమదాలవలస– తుది ఫలితం పాతపట్నం

ఎన్నికల ఫలితాల్లో తొలుత ఆమదాలవలస నియోజకవర్గం ఫలితం వెలువడుతుంది. జిల్లాలో తక్కువ పోలింగ్ బూత్‌లు(259) ఉన్న ఆమదాలవలస నియోజకవర్గం ఓట్ల లెక్కింపు 14 టేబుళ్లపై 19 రౌండ్లలో పూర్తి కానుంది. దీంతో తొలి ఫలితం ఈ నియోజకవర్గానిదే. తుది ఫలితం మాత్రం పాతపట్నం నియోజకవర్గంకు సంబంధించి ఉండబోతోంది. అత్యధికంగా 323 పోలింగ్ బూత్‌లు ఉండటంతో 14టేబుళ్లపై లెక్కింపు పూర్తయ్యే సరికి 24రౌండ్లు పట్టనుంది. వరుసగా చూస్తే ఆమదాలవలస తర్వాత శ్రీకాకుళం, పలాస, నరసన్నపేట, ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గ ఫలితాలు వెలువడనున్నాయి.



కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

- అత్యంత భద్రత, పారదర్శకతతో లెక్కింపు
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకులు శేఖర్ విద్యార్థి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు మంగళవారం ఎచ్చెర్ల శివాని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నామని, లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. వివిధ కేడర్లలో లెక్కింపు చేసేందుకు, అన్ని స్థాయిల్లో సుమారుగా 2000 మంది ఉద్యోగులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చి కౌంటింగ్ విధులకు కేటాయించామని అన్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ అధికారికంగా ప్రారంభమవుతుందని, ముందుగా పోస్టల్ బ్యాలెట్‌ను ప్రారంభిస్తామని, అదే క్రమంలో ఆమదాలవలస నియోజకవర్గం నుంచి తొలి ఫలితం, చివరగా పాతపట్నం ఫలితాలు వెల్లడించే అవకాశం ఉందని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కౌంటింగ్ కోసం 17 కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేశామని, 112 ఈవీఎంలను లెక్కించే టేబుళ్లు, 30 పోస్టల్ బ్యాలెట్ లెక్కించే టేబుళ్లు ఉంటాయన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభం కాగా, అరగంట తర్వాత ఈవీఎంల లెక్కింపు జరుగుతుందన్నారు.

కౌంటింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, పోలీసు సిబ్బంది, ఏపీఎస్పీ, ఐటీబీపీతో కలిపి మూడంచెల భద్రతను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆర్‌ఓ, ఏఆర్‌వో, అబ్జర్వర్, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కౌంటింగ్ జరుగుతుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్ ప్రాంగణంలోకి ప్రవేశించిన తర్వాత, కౌంటింగ్ ముగిసే వరకు ఉండవచ్చని చెప్పారు. అయితే ఒకసారి వెళ్లిపోతే మళ్లీ లోపలికి అనుమతించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఐదు వైద్య ఆరోగ్యశాఖ బృందాలు, రెండు అంబులెన్సులు, ఫైర్ సిబ్బంది అందుబాటులో ఉంచామన్నారు.

మద్యం విక్రయాలపై 24 గంటల నిషేధం

కౌంటింగ్ రోజున 24 గంటల పాటు మద్యం విక్రయాలపై నిషేధం విధిస్తున్నట్లు, సెక్షన్ 144 అమల్లోకి వస్తుందని ఎస్పీ రాధిక పేర్కొన్నారు. అభ్యర్థులు, పార్టీలు ఎవరూ విజయోత్సవ ర్యాలీలు నిర్వహించవద్దని, ఉల్లంఘించిన వారిని అదుపులోకి తీసుకుంటామని హెచ్చరించారు.

కౌంటింగ్ రోజున శివాని ఇంజినీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధించామని, కౌంటింగ్‌కి హాజరయ్యే సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు తమతో ఎలాంటి మొబైల్ లేదా ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురావద్దని స్పష్టం చేశారు. జిల్లాలో 55 పికెట్స్ ఏర్పాటు చేశామని, నియోజకవర్గానికి మూడు చొప్పున క్యాట్ బృందాలు తిరుగుతాయని, ఎక్కడైనా అలజడులకు పాల్పడిన వారిని ఈ బృందాలు అదుపులోకి తీసుకుంటాయని పేర్కొన్నారు. బాణసంచా కాల్చడం పూర్తిగా నిషేధమని, ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాలో 4877 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, అదనపు ఎస్పీ ప్రేమ కాజల్ విలేకరుల సమావేశంలో ఉన్నారు.



ఏర్పాట్ల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులు శేఖర్ విద్యార్థి, తలత్ పర్వేజ్ ఇక్బాల్ రోహీల్, మలతుస్ ఎస్.సంగమ్, అనుజకుమార్ దాస్, అశోక్ కుమార్, ఎస్.సంగీత, అజీజ్ శుక్లదాస్‌ల బృందంతో కలిసి కలెక్టర్, జిల్లా ఎన్నికలు అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదివారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలించి, కౌంటింగ్ కేంద్రాల వద్ద చేసిన ఏర్పాట్లు గమనించారు. ఏర్పాట్లపై సిబ్బందితో సమీక్షించారు. పరిశీలనలో విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ, ఎస్పీ జీఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్పీ సీఈఓ డి.వెంకటేశ్వరరావు, సుడా వైస్ చైర్మన్ చల్లా ఓబులేసు పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు, జిల్లా అధికారులు

కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: కౌంటింగ్ సందర్భంగా చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్ పరిసర ప్రాంతాల్లో సకల సదుపాయాలు కల్పిస్తున్నారు. జాతీయ రహదారిపై కౌంటింగ్ హాళ్లకు వెళ్లే దారి చూపిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కేశవరావుపేట పంచాయతీ పరిధి కింతలిమిల్లు వద్ద సర్వీస్ రోడ్డు మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది. ఎచ్చెర్ల మీదుగా వెళ్లాక చిలకపాలెంలో ఫ్లై ఓవర్ కింద నుంచి కళాశాల వెనక వైపు మార్గం ఏర్పాటు చేశారు. ఈ మేరకు రోడ్లు సైతం సిద్ధం చేశారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు, అభ్యర్థులు వెనక వైపు నుంచి వెళ్లాల్సి ఉంటుంది. అధికారులు, ఏజెంట్ల కోసం పార్కింగ్ స్థలాలు కేటాయిస్తున్నారు. రెండు కిలో మీటర్ల పరిధిలో రెడ్‌జోన్ ఉంటుంది. మూడంచెల భద్రత కొనసాతుంది. ఇప్పటికే పోలీసులు కళాశాల బయట సైతం భద్రత ఏర్పాటు చేశారు. 16 కౌంటింగ్ హాళ్లు సిద్ధం చేశారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్‌లతో కౌంటింగ్ ప్రారంభిస్తారు. పూర్తిస్థాయి ఏర్పాటు చేస్తున్నారు. రౌండ్‌ల వారీ ఫలితాలను కంప్యూటరీకరించి, ఆన్‌లైన్ చేస్తారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత కొనసాతుంది.



పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపునకు సిద్ధం చేసిన కౌంటింగ్ హాల్

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

- ఎస్పీ జీఆర్ రాధిక



శ్రీకాకుళం క్రైమ్ : ఎన్నికల తుది ఫలితాలు వెలువడే రోజున ప్రజలు, రాజకీయ నాయకులు సంయమనం పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదని ఎస్పీ జీఆర్ రాధిక కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ పలు సూచనలు చేశారు. జిల్లాలో 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని, ఎక్కడా నలుగురి కంటే ఎక్కువ మంది గూమిగూడి ఉండకూడదన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ధర్నాలు, ఉత్సవాలు చేయకూడదన్నారు. బాణసంచా కాల్చేందుకు, సభలు నిర్వహించడానికి అనుమతి లేదని, ఇప్పటికే బంకు యాజమాన్యాలకు లూజ్ పెట్రోల్ అమ్మకాలు నిషేధానికి నోటీసులు ఇచ్చామన్నారు.

నిఘానేత్రంలో..

కౌంటింగ్ కేంద్రాల వద్ద 288 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, జిల్లావ్యాప్తంగా ముఖ్య కూడళ్లలో మరో 536 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జిల్లాకేంద్రంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌నకు అనుసంధానం చేశామని ఎస్పీ చెప్పారు. వీటి ద్వారా కౌంటింగ్ ప్రక్రియ ప్రతి నిమిషం అణువణువు పర్యవేక్షిస్తామన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల నిఘా పెట్టడం జరిగిందని, జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తామన్నారు. అదేవిధంగా బాడీవార్న్ కెమెరాల ద్వారా శాంతిభద్రతలపై దృష్టిసారిస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో జిల్లాలోని శ్రీకాకుళం టెక్కలి, కాశీబుగ్గ సబ్‌డివిజన్ల వారీగా మొత్తం 1459 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు నిమిత్తం నియమించామని పేర్కొన్నారు. కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లకు బ్రీత్ అనలైజర్‌తో టెస్ట్ చేసి లోపలికి అనుమతిస్తామన్నారు.

అన్ని జిల్లాలో 212 సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని కోరారు. ఇప్పటికే చాలాచోట్ల కార్డన్ సెర్చ్‌లు నిర్వహించామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 879 మంది ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి నిరంతరం కౌన్సిలింగ్ చేశామని, రౌడీషీటర్లకు కూడా కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. పలు గ్రామాల్లో పల్లెనిద్రలు కూడా నిర్వహించామని, సరిహద్దులో భద్రత పటిష్టం చేశామని చెప్పారు. జిల్లాలోని లాడ్జీలు, హోటళ్లను కూడా నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు.

శివానీ పరిసరాల్లో రెడ్‌జోన్..

కౌంటింగ్ దృష్ట్యా ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో శివానీ ఇంజినీరింగ్ కళాశాల చుట్టుపక్కల రెండు కిలోమీటర్ల పరిధి వరకు రెడ్‌జోన్‌గా ప్రకటించామని, జూన్ 4 ఉదయం నాలుగు గంటల నుంచి కుశాలపురం కూడలి నుంచి కుడివైపు సర్వీసు రోడ్డు మార్గం ద్వారా వాహనాలను మళ్లిస్తామని పేర్కొన్నారు. సిబ్బంది నిర్దేశించిన ట్రాఫిక్ నియమాలను పాటించి కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

శ్రీకాకుళం పాతబస్టాండ్: కౌంటింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణలో భాగంగా ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలకులు శేఖర్ విద్యార్థి, తలత్ పర్వేజ్ ఇక్బాల్ రోహీల్, మాలతుస్ ఎస్ సంగమ్, అనుజ కుమార్ దాస్, అశోక్ కుమార్, ఎస్ సంగీత, అజీజ్ శుక్లదాస్ సంయుక్త పర్యవేక్షణలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్ణయించిన ప్రకారం కౌంటింగ్ సిబ్బందికి.. నియామక ఉత్తర్వులను అందజేస్తామన్నారు. తుది విడత కౌంటింగ్ రోజున ఆయా కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో నిర్వహిస్తామన్నారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, టెక్కలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, పలాస నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్, శ్రీకాకుళం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్ రంగయ్య పాల్గొన్నారు.

ఫలితాల రోజు 'డ్రై డే'



శ్రీకాకుళం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల ఫలితాల లెక్కింపు రోజంతా 'డ్రై డే'గా ఎన్నికల కమిషన్ ప్రకటించిందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.సుబ్బారావు తెలిపారు. జిల్లా అంతటా మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు, బీరు ఫ్యాక్టరీ తదితర ప్రదేశాలు మూతపడతాయన్నారు. సోమవారం సాయంత్రం 9 గంటల నుంచి మద్యం దుకాణాలు, 11 గంటలకు బార్లు మూసివేస్తామన్నారు. 5వ తేదీన సాధారణ సమయాల్లోనే దుకాణాలు తెరుచుకుంటాయని తెలిపాయి.



రైల్వేట్రాక్‌పై కూలిన చెట్టు

టెక్కలి రూరల్: ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని ఈదురుగాలులు వీయడంతో పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. స్థానిక తెంబూరు రోడ్ రైల్వేట్రాక్‌పై చెట్టు పట్టాల మధ్య పడటంతో అదే సమయానికి పూరి గుణుపూర్ ప్యాసింజర్ రైలు రావడంతో గేటు వేశారు. అయితే గేటుకు సమీపంలో చెట్టు కూలిపోవడంతో రైలు కొద్దిసేపు నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది హుటాహుటిన చెట్టుపడిన చోటుకు చేరుకొని ట్రాక్‌పై పడిన చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



పలాసలో వర్ష బీభత్సం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఆదివారం సాయంత్రం వర్షం బీభత్సం సృష్టించింది. సాయంత్రం ఆరు గంటల నుంచి ఈదురుగాలులు వీయగా ఏడు గంటలకు ఉరుములు మెరుపులతో వర్షం బీభత్సం సృష్టించింది. సుమారు గంటన్నర సమయం కురిసిన వర్షానికి ప్రజలంతా సంతోషించారు. పలాస, కాశీబుగ్గ, మందస గ్రామీణ ప్రాంతాలలో వర్షం కురిసింది.



కోటబొమ్మాళిలో జడివాన

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలో ఆదివారం రాత్రి సుమారు గంటసేపు జడివాన కురిసింది. గాలితో కూడిన వర్షం పడడంతో చల్లని వాతావరణంలో ప్రజలు సేద తీరారు. ఎండల్లో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

మోడల్ లాసెట్‌కి మంచి స్పందన


పరీక్షలు నిర్వహిస్తున్న బీసీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీ బీసీ న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీఆర్ న్యాయ కళాశాలలో నిర్వహించిన మోడల్ లా సెట్ పరీక్షలకు మంచి స్పందన వచ్చింది. ఈ పరీక్షకు జిల్లా నలుమూలల నుంచి సుమారుగా 30 మంది వరకు హాజరయ్యారు. ఈ మోడల్ పరీక్ష తమకు ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. నిర్వాహకులను ఎంపీఆర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మోషే అభినందించారు. కార్యక్రమంలో బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, సీహెచ్ లక్ష్మణరావు, న్యాయవాదులు కొమ్ము రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కారులో ఒడిశా మద్యం పట్టివేత


అధికారులకు దొరికిన ఒడిశా మద్యం సీసాలు, కారు

ఇచ్ఛాపురం రూరల్: మారుతీ సుజుకీ కారులో 402 ఒడిశా మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్ఈబీ సీఐ విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం పలాసలో ఎస్ఈబీ ఏఈఎస్ బేగం ఆధ్వర్యంలో కరాపాడు టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ కారులో మద్యం సీసాలు దొరికాయని, మద్యం సీసాలను, కారును స్వాధీనం చేసుకొని ముద్దాయిని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. దాడిలో ఇచ్ఛాపురం ఎస్ఈబీ ఎస్ఐ కె.అనీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న మహారాష్ట్ర ఐఏఎస్ అధికారి


స్నేహాల్‌కు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ చంద్రశేఖర్, శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామిని మహారాష్ట్రకు చెందిన ఐఏఎస్ అధికారి స్నేహల్ ప్రతాప్ భోస్లే ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈఓ ఎస్.చంద్రశేఖర్‌లు గౌరవ సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. తాను తొలిసారిగా ఆదిత్యుని దర్శించుకున్నానని, ఎన్నో ఏళ్ల నుంచి మొక్కు చెల్లించేందుకు ప్రయత్నిస్తుంటే నేటికి సాధ్యమైందన్నారు. శంకరశర్మ ఆలయ విశిష్టతను వివరించారు.

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు స్వల్ప విరామం


శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రంలో విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ మేరకు పాలిటెక్నిక్ ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఏపీ పాలీసెట్-2024 కౌన్సెలింగ్ కొనసాగుతోంది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో షెడ్యూల్ మేరకు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్నారు. ఈ నెల 27వ తేదీన కౌన్సెలింగ్ ప్రారంభం కాగా, ఆదివారం 92001 నుంచి 108000 ర్యాంకు మధ్య విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో సోమవారం నుంచి జరగాల్సిన కౌన్సెలింగ్ ప్రక్రియను ఆరో తేదీకి రీషెడ్యూల్ చేశారు. ఆరో తేదీన 108001 నుంచి చివరి ర్యాంకు వరకు విద్యార్థులు హాజరుకానున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియను శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, అధ్యాపకులు మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.


అటవీ శాఖ అధికారులు తొట్టెల్లోకి నీటిని నింపుతున్న ఈ ప్రాంతం అంతరాబ ఫారెస్ట్ బీట్ పరిధిలో ఉంది. వెడల్పుగా నిర్మించిన ఈ తొట్టెల్లోకి వారంలో రెండు సార్లు నీటిని నింపుతుండటంతో వన్యప్రాణులకు దాహం కష్టాలు తీరుతున్నాయి. అటవీ ప్రాంతం మొత్తం ఇలాంటి తొట్టెలు నెలకొల్పడంతో ఎండల నుంచి వన్యప్రాణులు కొంత వరకు ఉపశమనం పొందుతున్నాయి.



అడవికి అండ

- వన్య ప్రాణుల దాహార్తి తీర్చేలా అటవీ శాఖ ప్రత్యేక చర్యలు
- విస్తృతంగా నీటి తొట్టెలు, సాసర్ రింగ్స్ ఏర్పాటు
- ఇప్పటికే 60 నీటి తొట్టెల ఏర్పాటు

పాతపట్నం:

మండు వేసవిలో అడవి జంతువుల దాహం తీర్చేందుకు అటవీ శాఖ నడుం బిగించింది. వన్యప్రాణులు నీటిని వెతుక్కుంటూ ఊళ్లపైకి రాకుండా అడవిలోనే నీటి వనరులు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. వేసవి వచ్చిందంటే చాలు నీరు, ఆహారం దొరక్క వన్యప్రాణులు జనారణ్యంలోకి రావడం, మృత్యువాత పడటం, అడవుల్లో అగ్ని మంటల్లో చిక్కడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో వన్య ప్రాణుల రక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అటవీ శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. వన్యప్రాణుల దాహం తీర్చడంతో పాటు అడవుల సంరక్షణకు విశేష కృషి చేస్తోంది.

గొంతు తడిపేదిలా..


ఫారెస్ట్‌లో వన్యప్రాణుల కోసం చెట్లకు ఏర్పాటు చేసిన సాల్ట్ సాసర్స్

అడవుల్లో ఫైర్‌లైన్ ఏర్పాటు చేసి వృక్ష, జంతుజాలానికి రక్షణ కల్పిస్తున్నారు. అలాగే వన్యప్రాణుల సౌకర్యార్థం అదనంగా చెక్‌డ్యామ్‌లు, ఫారం పాండ్లు, సాసర్ రింగ్స్ లాంటివి ఏర్పాటు చేస్తున్నారు. ట్యాంకర్లు, మోటార్ పైపుల ద్వారా నీటిని నింపుతూ వన్యప్రాణుల గొంతు తడుపుతున్నారు. కంపా నిధుల ద్వారా అడవుల సంరక్షణకు అటవీశాఖ చేస్తున్న పనులు సత్ఫలితాలు ఇస్తున్నాయి. జిల్లాలోని నాలుగు ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలో 64,400 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి, పాతపట్నం, కాశీబుగ్గ రేంజ్‌లు ఉన్నాయి. పాతపట్నం ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలో జింకల సంచారం పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

60 తొట్టెల ఏర్పాటు..


అడవిలో నీటి తొట్టెను పైప్‌తో నింపుతున్న అటవీ శాఖ అధికారులు

జిల్లాలోని అన్ని ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలోని బీట్లలో సుమారు 60 నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వన్యప్రాణులకు సమృద్ధిగా తాగునీరు అందిస్తున్నారు. మరిన్ని సాసర్ పిట్స్, చెక్‌డ్యామ్‌లు, స్ట్రెచ్చర్, పెర్కొలేషన్ ట్యాంకులు, నీటి కుంటల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని అధికారులు చెబుతున్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన

అడవుల ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన అవసరం. వేసవి వచ్చిందంటే కార్చిచ్చు బారిన పడి పచ్చ సంపద కాస్త బుగ్గిపాలవుతుంది. సమీపాన ఉన్న ప్రజలకు అడవుల సంరక్షణ, ప్రాముఖ్యతపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కాపరులను కేవలం పశువుల మేత మేపేందుకు మాత్రమే అనుమతిస్తున్నారు. ఇతరులను అడవుల్లోకి వెళ్లనీకుండా అడ్డుకుంటున్నారు. అటవీ సంపద మంటల పాలు కాకుండా ఫైర్‌లైన్ల నిర్వహణపై దృష్టి పెట్టారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే శాటిలైట్ ద్వారా వచ్చే మెసేజ్ అలర్ట్‌తో ఆ ప్రాంతానికి చేరుకుని మంటలను నివారించేలా ఫైర్ బోయర్లను అందుబాటులో ఉంచారు.

అడవుల్లో వన్య ప్రాణుల సందడి

జిల్లాలోని నాలుగు ఫారెస్ట్ ప్రాంతాల్లో వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. దుప్పులు, కుందేళ్లు, జింకలు, నెమళ్లు, అడవి పందులు, పక్షులు ఎక్కువగా ఉన్నాయి. జగనన్న పచ్చ తోరణంలో భాగంగా జంతువులు, పక్షుల కోసం ఎక్కువగా నేరేడు, ఉసిరి, మారేడు, వెలమ, చింత, వేప, రావి, మర్రి వంటి పండ్ల మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా మరిన్ని ప్రాంతాల్లో ఎర్రమద్ది, నల్లమద్ది, సిందుగ, లోలుగ వంటి విత్తనాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

అడవుల విస్తరణకు కృషి


అడవులు, వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత, అడవుల విస్తరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పలు జాతులకు చెందిన మొక్కలను పెంపొందించేలా కృషి చేస్తున్నాం. అడవులు, వన్యప్రాణులకు ముప్పు కల్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా అడవుల్లో సంచరించకూడదు. జంతువులను వేటాడి పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– ఆర్.రాజశేఖర్,ఫారెస్ట్ రేంజర్, పాతపట్నం

ఒక్క రోజు ఆదాయం రూ.9.57లక్షలు


సాధారణ క్యూలలో కిక్కిరిసిన భక్తులు


తలనీలాల మొక్కులకు బారులు తీరిన భక్తులు


ప్రత్యేక దర్శన క్యూలో భక్తులు

అరసవల్లి: పవిత్ర వైశాఖ మాసం నాలుగో ఆదివారం సందర్భంగా అరసవల్లిలో వైశాఖాదిత్యుని దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఇతర జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి ప్రత్యేక సంప్రదాయ పూజలను చేయించుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి సర్వదర్శనాలకు అనుమతి ఇవ్వడంతో పాటు స్థానిక అసిరితల్లి అమ్మవారి ఆలయం పక్క నుంచి ఇంద్రపుష్కరిణికి ఈశాన్య ద్వారాల నుంచి రూ.100, ఉచిత దర్శనాలు, విశిష్ట దర్శనం (రూ.500)లకు వచ్చే భక్తులకు ప్రవేశాన్ని కల్పించారు. పుష్కరిణి వద్ద నుంచి ప్రత్యేక మార్గాల ద్వారా వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఈ మార్గాల్లో భక్తులకు ఎండ వేడిమి నుంచి రక్షణ కల్పించేందుకు ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆదివారం ఒక్క రోజులోనే రూ. 9.76లక్షలు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ తెలియజేసారు. దర్శన టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.8.57లక్షలు, విరాళాల ద్వారా రూ. 83,044, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3.20లక్షలు వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ తెలియజేశారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి


చక్కగా అలంకరించిన పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరునికి జ్యేష్ఠ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు.

• నాలుగు దశాబ్దాల తర్వాత..


నాలుగు దశాబ్దాల తర్వాత అదే పాఠశాలలో చదివిన విద్యార్థులంతా ఆదివారం కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. శ్రీకూర్మం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1983-84 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా ఆదివారం మళ్లీ కలిశారు. అప్పటి ఆరుగురు మాస్టార్లతో పాటు పాఠశాల స్థలదాత కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పెంట శ్రీనివాస్‌శర్మ, టీపీ వేణుగోపాల్, ఆర్ఎన్ స్వామి, గుప్త, సుమన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

-గార

క్రమశిక్షణ కలిగిన వ్యక్తి సాంబమూర్తి


సాంబమూర్తి దంపతులను సన్మానిస్తున్న కృష్ణదాస్ తదితరులు

నరసన్నపేట: ఉపాధ్యాయ వృత్తి చేపట్టి ఎందరో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దిన టీకే సాంబమూర్తి ఆదర్శనీయులని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సాంబమూర్తి దీర్ఘాశి ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నరసన్నపేటలో ఆయన శిష్యులు, కుటుంబ సభ్యులు ఆదివారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణదాస్ మాట్లాడుతూ.. తమ గ్రామానికి చెందిన సాంబమూర్తి ఉపాధ్యాయుడిగా మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తికే న్యాయం చేశారన్నారు. దుశ్శాలువతో సత్కరించి, మెమెంటో అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

• జిహ్వ 'చేప'ల్యం తీరేలా..


మండలంలోని లొద్దలపేట గ్రామంలో గల సూరప్ప చెరువులో ఆదివారం చేపల వేట సందడిగా సాగింది. సెలవు దినం కావడంతో గ్రామంలో ఉన్న వాళ్లంతా కలిసి చెరువులో చేపల కోసం వలలు వేసి ఆనందంగా గడిపారు.

- ఆమదాలవలస రూరల్

సముద్ర స్నానానికి వెళ్లి విద్యార్థి మృతి

- భావనపాడులో ఘటన
- మృతునిది సారవకోట మండలం మర్రిపాడు
- ఒకే ఏడాది కుమార్తె, కుమారుడు మృతి


మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు


జన్ని ఉపేంద్ర (ఫైల్)

సంతబొమ్మాళి/సారవకోట: సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్ర తీరంలో స్నానానికి వెళ్లి.. సారవకోట మండలం కూర్మనాథపురం పంచాయతీ మర్రిపాడు గ్రామానికి చెందిన జన్ని ఉపేంద్ర(17) ఆదివారం మృతి చెందాడు. మర్రిపాడు గ్రామానికి చెందిన సుమారు 40 మంది ట్రాక్టర్, ఆటోల్లో భావనపాడు బీచ్‌కు వెళ్లారు. మర్రిపాడు గ్రామానికి చెందిన చలపతిరావు, అప్పలయ్య కుమారుడు ఉపేంద్ర కూడా వారితో వెళ్లాడు. బంధువుల పిల్లలు మేఘన, దీపిక, కల్పనలతో కలిసి సముద్రంలోకి దిగాడు. కెరటాలు ఉధృతంగా రావడంతో ఆ ముగ్గురు పిల్లలు లోపలకు వెళ్లడం గమనించిన ఉపేంద్ర కేకలు వేస్తూ తాను కూడా లోపలకు వెళ్లిపోయాడు. వారితో ఉన్న తోటి గ్రామస్తులు ముగ్గురు పిల్లల్ని రక్షించారు. కానీ ఉపేంద్రను ఎవరూ గమనించలేదు. కాసేపటికి ఉపేంద్ర మృతదేహం తీరానికి కొట్టుకునివచ్చింది. దీంతో అంతా నిశ్చేష్టులైపోయారు. దీనిపై నౌపడ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు మెరైన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మెరైన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఘటనపై నౌపడ ఎస్ఐ కిశోర్ వర్మ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని టెక్కలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు పలాసలో ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

ఒకే ఏడాది కుమార్తె, కుమారుడు మృతి

చలపతిరావు, అప్పలమ్మ పెద్దకుమార్తె మీనా ఈ ఏడాది జనవరిలో విశాఖపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆదివారం ఉపేంద్ర కూడా సముద్రంలో మునిగి చనిపోయాడు. దీంతో ఆ తల్లిదండ్రులకు దుఃఖానికి అంతు లేకుండా పోయింది. కొడుకును పోగొట్టుకున్న బాధలో వారు కన్నీరుమున్నీరయ్యారు.

'దమనకాండను ఖండించండి'


సమావేశంలో మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం నాయకుడు దానేసు

పలాస: దండకారణ్యంలో కేంద్ర పోలీసు బలగాలు 'కగార్' పేరుతో చేపడుతున్న దారుణ దమనకాండను పౌర సమాజం ఖండించాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బొడ్డపాడులో ఆదివారం పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు దానేసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొని దండకారణ్యంలో ఆదివాసీల హక్కుల కోసం జరుగుతున్న పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ఇటీవల గత కొంత కాలంగా అక్కడ జరుగుతున్న హింసాత్మక సంఘటనలను పరిశీలించడానికి గత నెల 29న నిజ నిర్ధారణ కమిటీ ప్రతినిధులు వెళ్లగా చత్తీస్‌గఢ్ ప్రభుత్వం, అక్కడ పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారని, వారిని వెనక్కి పంపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. దండకారణ్యంలో 120 మంది అమాయకులైన ఆదివాసీలను, కొంతమంది మావోయిస్టులను పట్టుకుని కాల్చిచంపారని, అక్కడ ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ ప్రజలకు స్వేచ్ఛాయుత వాతావరణం కావాలని, అందుకు ప్రతి ఒక్కరు ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని కోరారు. సమావేశంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకుడు తామాడ సన్యాసిరావు, న్యూడెమొక్రసీ జిల్లా నాయకుడు గొరకల బాలకృష్ణ, పీఓడబ్ల్యూ నాయకురాలు పోతనపల్లి కుసుమ, పోతనపల్లి కామేశ్వరరావు, మద్దిల రామారావు, దుష్యంతు, ఢిల్లీరావు, జగదీష్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.